# సాహిత్య మహాత్ముడు

శ్రీ గౌతమీ గ్రంథాలయము, రాజమహేంద్రవరము



శ్రీ శ్రీ

తన్ను చంపినవాడికి ఉరిశిక్ష విధించ వద్దనీ క్షమాభిక్ష పెట్టమనీ గాంధీజీ కోరడం, అయినా గాడ్సేను ఉరితీయడం మనకు తెలిసినదే! అలాగే మల్లాదివారు తమ మరణానంతరం స్మారక సంచికలు వెయ్యడానికి సుతరామూ ఇచ్ఛగించక పోయినా మన విధి మనం నిర్వహించక తప్పదు. ఈ సందర్భంలో ఒక ఆప్తమిత్రునికి నా శ్రద్ధాంజలి సమర్పించడానికే ఈ రెండు ముక్కలూ రాస్తున్నాను.

మొదటి ముక్క యేమిటంటే నేను ఆరోజుల్లో రాసే గేయాల్లో కొన్ని ముక్కలను శీర్షికలుగా స్వీకరించి చక్కని కథలుగా మలిచాడాయన. జౌను నిజం, లేదు విషం ఇత్యాదులు. అప్పటికి మేం ఒకర్నొకరం పత్రికాముఖంగానేగాని ముఖాముఖని కలుసుకోలేదు.

ముప్ఫైయేళ్ళకి పైమాటే అనుకుంటాను—రామకృష్ణశాస్త్రిగారిని నేను మొదటిసారి కలుసుకొని. అయితే అది బందరులో నవ్యసాహిత్య పరిషత్తు సభల్లోనా, లేక బెజవాడలో ముద్దుకృష్ణ "జ్వాల" గోల మధ్యనా అనేది జ్ఞాపకం లేదు. తేదీ తెలియని కాలంలో, పేరు తెలియని పట్టణంలో మేం కలుసుకున్నాం. ఇంతకంటే స్పష్టతకోసం ప్రయత్నిస్తే జ్ఞాపకాన్ని చిత్రవధ చేసినట్టే అవుతుంది.

ఎటువంటి క్లిష్టమైన భావాన్నైనా తెలుగులో ఇట్టే సులువుగా చెప్పవచ్చునని మా మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు అంటూ ఉండేవారు. దాన్ని ఆచరణలో చూపించినవారు శ్రీ మల్లాది. ఎంతవరకు కృతకృత్యుణ్ణయానో నాకు తెలియదుగాని కవిత్వంలో నేను లక్ష్యంగా పెట్టుకున్నది ఇదే.

ముప్ఫయేళ్ళుగా ఇద్దరం మద్రాసులోనే ఉన్నా ఉభయులం కలుసుకున్న సమయాలు కొద్ది. ఎప్పుడూ ఆయన నన్ను "ఎంత మంచి కవిత్వం రాశావు" అని వెన్నుదట్టలేదు. "ఆహా! ఎంత గొప్ప కథలండీ మీవి" అని నేనూ మాటవరసకైనా అనలేదు. ఆ అనకపోవడంలోనే అనడం ఉంది.

మల్లాదివారి రచనల్ని మదింపువెయ్యడం నా ఉద్దేశం కాదు. అలా చెయ్యబోవడం అవినయం. మరో నూరేళ్ళ తర్వాత కూడా తరిగిపోని నైగనిగ్యం వారి రచనల్లో ఉంది. ప్రత్యేకంగా కథాసాహిత్యంలో వారి కృషి వర్ణించడానికి ఒకేఒక విశేషణం దానంతట అదే నా మనస్సుకు స్ఫురిస్తుంది. Monumental అన్నదే ఆ విశేషణం. కొన్ని పాలరాతి వాస్తు శిల్పాలు. కొన్ని చందనపు చెక్కలతో చేసినవి. మరికొన్ని కంచు విగ్రహాలు. కాని వాస్తుశిల్ప కళాకారులకు సాధ్యంకాని పని ఈ సాహిత్య కళాకారుడు చేశాడు. అదేమిటంటే నీళ్ళతోనూ, గాలితోనూ కూడా Monumental Creations చేశాడు. అదే మల్లాది రామకృష్ణశాస్త్రి విశిష్టత.

*